# ప్రజావాణి అర్జీలపై దృష్టి సారించాలి

- సీఎం గ్రీవెన్స్ దరఖాస్తులకు ప్రత్యేక సెల్
- ప్రతి అర్జీదారుడికి రసీదు అందించాలి
- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, డిసెంబర్ 8 : ప్రజావాణి అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి దరఖాస్తులపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం గ్రీవెన్స్ నుంచి వచ్చే దరఖాస్తులకు కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో సెల్ పని చేస్తుందని తెలిపారు. ప్రజావాణిలో మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని, అర్జీదారులు, అధికారలు వెబెక్స్ స్క్రీన్‌లో కనబడాలని సూచించారు. త్వరలో జీపీ స్థాయిలో ప్రజావాణి నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సీఈఓ, డీపీఓకు సూచించారు. శనివారం సాయంత్రం వరకు ఆయా మండలాల్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను గూగుల్ షీట్‌లో పంపాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబందించిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీసీఈఓ సురేశ్, డీఆర్డీఓ కిరణ్‌కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, డీసీఓ మోహన్‌బాబు, ఏఓ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## సంతోషిమాత ఆలయంలో కార్తీకమాస పూజలు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 8 : సూర్యాపేటలోని సంతోషమాత ఆలయంలో శుక్రవారం కార్తీకమాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రదాన అర్చకుడు ఇరువంటి శివరామకృష్ణశర్మ అమ్మవారికి పంచామృత అభిషేకాలు జరిపారు. 21 రకాల హారతులతో అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్ మాట్లాడుతూ ఈ నెల 10న ఆత్మకూర్.ఎస్ మండలం పాత సూర్యాపేట స్టేజీ వద్ద గల సంతోషిరూపా దేవి ఫల వృక్ష క్షేత్రంలో కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొత్త మల్లికార్జున్, బ్రాహ్మనపల్లి బ్రహ్మయ్య, పాలవరపు రామమూర్తి, పబ్బా ప్రకాశ్, సోమా శ్రీశైలం, అశోక్, సోమయ్య, వెంకటేశ్వర్లు, రాజు, పురుషోత్తం పాల్గొన్నారు.



జాటోతుతండాలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

## నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలు నాటాలి

- ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 8 : నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలు నాటాలని, పది రోజుల్లో మొలకెత్తేలా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని బాలెంల, ఎర్కారం, జాటోతుతండా, రామారంలో నర్సరీలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- డీఎంహెచ్‌ఓ కోటాచలం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

తుంగతుర్తి, డిసెంబర్ 8 : ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటాచలం అనారు. శుక్రవారం తుంగతుర్తి ప్రభుత్వ దవాఖానలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు రక్తహీనత లేకుండా పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రోజు ఐరన్ మాత్రలు వేసుకునేలా చూడాలని, ప్రభుత్వ దవాఖానలో ప్రసవం చేయించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. డ్రైడే నిర్వహించి గ్రామాల్లో దోమలను నివారించడంపై ప్రజలను చైతన్యపర్చాలన్నారు. హైపర్ టెన్షన్, డయాబెటీస్ నిర్ధారణ కోసం 30సంవత్సరాలు పైబడిన వారికి స్క్రీనింగ్ పూర్తి చేయాలని, క్షయ, లెప్రోసి నిర్ధారణకు గ్రామాల్లో క్యాంపులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో వైద్యాధికారి లింగమూర్తి, ఆరోగ్య విస్తరణ అధికారి సముద్రాల సూరి, ఆకారపు సైదమ్మ, జి.జానకమ్మ, విజయ్, భూమిక, పర్మానాయక్, తేజ, మౌనిక, సరిత, హెల్త్ అసిస్టెంట్లు గాజుల సోమయ్య, నర్సింహాచారి, నవీన్ కుమార్, భారతి, స్వాతి, జయమ్మ, బేబి, రూప, స్వప్న, రజిత పాల్గొన్నారు.

## 10న ఉండ్రుగొండలో స్వాతీనక్షత్ర కల్యాణం

చివ్వెంల, డిసెంబర్ 8 : మండలంలోని ఉండ్రుగొండలో లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో ఈనెల 10న కార్తీకమాస స్వాతీనక్షత్ర కల్యాణం, 11న ఉమా మహేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చకిలం కృష్ణకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఏడు కాళ్ల దూడ

## ఏడు కాళ్ల దూడ జననం.. మృతి

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 8 : మండల పరిధిలోని ఎర్కారంలో శుక్రవారం ఏడు కాళ్ల దూడ జన్మించింది. గ్రామానికి చెందిన మిద్దె సైదులు బర్రె మధ్యాహ్నం ఏడు కాళ్ల దూడకు జన్మనిచ్చింది. పశువైద్యాధికారులకు సమాచారం అందించగా.. గంట దాటినా రాకపోవడంతో దూడ చనిపోయింది. జన్యులోపం వల్ల ఇలా జరుగుతుంటుందని వైద్య సిబ్బంది తెలిపారు.

## ఆర్థిక సాయం

నాంపల్లి, డిసెంబర్ 8 : మండలంలోని దేవత్‌పల్లి గ్రామానికి చెందిన ముదిగొండ జంగయ్య ఇటీవల మృతి చెందారు. జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట ఎరుకల నాగయ్య, యాదగిరి,జక్కుల రాజు, మారుపాకుల కొండలు, కుందారపు వెంకట య్య, ముదిగొండ మల్లేశ్, రత్నాకర్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

## ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

మోత్కూరు, డిసెంబర్ 8 : రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యాదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మోత్కూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నందున ఇంకా జిల్లాలో 30శాతం ధాన్యం కొనుగోలు కాలేదన్నారు. నూతన ప్రభుత్వం ఎన్నికల్లో మద్దతు ధరను పెంచుతామని ఇచ్చిన వాగ్ధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు బాలరాజు, కల్లూరి మల్లేశం, పాండు, బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి శివకుమార్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 8 : తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక విక్రమ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేల ఎకరాల్లో పంట నష్టపోయి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులతో సర్వే చేయించి పంట నష్టాన్ని తెలుసుకొని ఎకరానికి రూ.50వేల నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. సమావేశంలో ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు మట్టపల్లి అంజన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, పద్మక్క పాల్గొన్నారు.

## 'ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలి'

రామన్నపేట, డిసెంబర్ 8: రెండు దశాబ్దాల క్రితం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన ఆదర్శ రైతు వ్యవస్థను కొనసాగించాలని ఆదర్శ రైతు సంఘం మండలాధ్యక్షుడు బూరుగు వెంకటేశం ప్రభుత్వాన్నికోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదర్శ రైతు వ్యవస్థ ద్వారా వ్యవసాయ శాఖ, రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఆదర్శ రైతులు అధికారులకు, రైతులకు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తూ వచ్చారన్నారు. రైతులకు మేలు జరగడం కోసం ఆదర్శరైతు వ్యవస్థను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఆదర్శ రైతులు నోముల దశరథ, బుడ్డ రాములు, ఆముద లక్ష్మణ్, నక్క రాంనర్సయ్య ఉన్నారు.

## క్రాస్ కంట్రీ రేస్‌కు రామన్నపేట విద్యార్థి



లింగస్వామి

రామన్నపేట, డిసెంబర్8: మహారాష్ట్రలోని జాతీయ విశ్వవిద్యాలయం స్థాయి లో జరిగే క్రాస్ కంట్రీరేస్‌కు రామన్నపేట ప్రభు త్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎన్ లింగస్వామి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రహత్‌ఖానమ్ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న లింగస్వామి ఇటీవల మహాత్మాగాంధీ యూనివర్సిటీలో జరిగిన అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ రేస్‌లో పాల్గొని జాతీయ స్థాయిపోటీలకు ఎంపికయ్యారు. దాంతో లింగస్వామి తో పాటు పీటీ అధ్యాపకురాలు అనితను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

## సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



రామన్నపేట: వెల్లంకిలో వ్రతం ఆచరిస్తున్న భక్తులు

రామన్నపేట, డిసెంబర్ 8 : మండలకేంద్రంలోని చెన్నకేశవస్వామి, వెల్లంకి శంభులింగేశ్వర ఆలయాలో శుక్రవారం సామూహిక శ్రీరామ సమేత సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. కార్తీకమాసం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ఆలయ కమిటీ సామూహిక సత్యనారాయణస్వామి వ్రత కార్యక్రమాన్ని ఏర్పా టు చేశారు. ఆలయ పూజారులు పందిళ్ల విద్యాసాగరశర్మ, గోపిచార్యులు ఆధ్వర్యంలో గణపతి, నవగ్రహ, అష్టదిక్పాలక పూజల అనంతరం సత్యనారాయణస్వామి ప్రతిమకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఐదు కథలను వినిపించి నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వెల్లంకిలో పార్వతీదేవికి అభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలతో అలకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్లు లవణం ఉపేందర్, వనం సత్తయ్య, కణతాల శశిధర్‌రెడ్డి, కొంపెల్లి విజయానందం, ఠాగూర్ బలరాం సింగ్, తాటిపాముల స్వామి, మడూరి నర్సింహరావు, మిర్యాల సత్తయ్య, తాటి వీరస్వామి పాల్గొన్నారు.